# ఎంతెంత దూరం...

"ఇంతకీ దీంట్లో మెలిక ఏమిటుందంటారు?" అడిగాను మళ్లీ.

"ఇప్పటిదాకా మూడు సార్లు అడిగేరా ప్రశ్న. మీ కిష్టం లేకపోతే ఆ విషయం స్పష్టంగా చెప్పండి. ఈ వ్యవహారానికి స్వస్తి పలుకుదాం. నాకు కార్లు దొరక్కపోవు. మీకు స్థలాలు దొరక్కపోవు." అన్నాడు చరణ్ విసుగ్గా.

"కోపం తెచ్చుకోకండి సార్. ఏదో నా ఇది కొద్దీ అడుగుతున్నాను. మీ స్థలం చాలా విలువైనది కదా, నా కారు విలువ కంటే ఎంత లేదన్నా కనీసం మూడురెట్లుంటుంది. అది..."

"చెప్పానుగా, నా ఇష్టం నాది. మీకు కష్టమైతే..."

"అబ్బెబ్బె, అదేం లేదు. నేను మాట ఇచ్చేసానుగా. ఆ కారు మీద ఇవాళే మీరు వెళ్లిపోవచ్చు. ఎంత దూరం కావాలంటే అంత. కారుకేమీ ఢోకాలేదు. అవును, మీ రెక్కడిదాకా వెళదామనుకుంటున్నారు?"

"ఏమో, ఇంకా అనుకోలేదు. దూరంగా అని మాత్రం తెలుసు. దూరంగా... నాకు నేనే అందనంత దూరంగా..." అన్నాడతను.

నాకు చటుక్కున మా అక్కయ్య తరచుగా అనే మాటలు గుర్తొచ్చాయి.

'ఎక్కడికిరా పరుగులు? నువ్వెంత దూరమెళ్లినా నీ నుంచి పారిపోలేవు కదా. నీ అంతరాత్మ నీ వెంటనే, నీ తోనే, నీ లోనే వస్తోందిగా. అది వదులుతుందా? నిన్ను నిలదీస్తుంది - నువ్వు చేస్తున్నదేమిట్రా?' అని.

ఆ రోజు... కారు ఏక్సిడెంటు చేసి అర్ధరాత్రి ఇంటికి చేరిన రోజున కూడా ఇవే మాటలు. "వెళ్లి పోలీసులకు చెప్పి నీ హృదయభారం తగ్గించుకో" అని సలహా ఒకటి పైగా.

"చాల్లే, ఇద్దరం ఏభయ్యోపడిలో పడ్డాం. ఇద్దరికీ పెళ్లీ పెటాకులూ లేవు. నేను వెళ్లి జైల్లో కూచుంటే నీ ఆలనా, పాలనా చూసేవారెవరు?" అన్నా.

"ఆబాలగోపాలానికి చూసేవాడే నన్నూ చూస్తాడు." అంది చేతిలో ఉన్న భగవద్గీత అట్టమీది కృష్ణుణ్ని చూపిస్తూ.

"ఆ భగవద్గీత చదవడం తగ్గిస్తేనే గానీ నువ్వు బాగుపడవు." అని విసుక్కున్నాను. వెళ్లి విస్కీ గ్లాసులో పోసుకుని తెచ్చుకున్నాను. తనెదురుగా ఎన్నడూ తాగింది లేదు. ఆ రోజు మాత్రం చెప్పేశా. "ఇవాళ నాకు ఇది అత్యవసరం. చాలా నెర్వస్‌గా ఉన్నాను. ఇంటికెలా వచ్చిపడ్డానో నాకే తెలియదు. అదృష్టవశాత్తూ నన్నెవరూ చూడలేదు."

"ఒకరు నిన్ను చూశారు." అంది అక్క దృఢంగా అన్నీ తెలిసినదానిలా.

"ఎవరు?" అంటూ ఉలిక్కిపడుతూనే తన అభిప్రాయం తెలిసి ఊరడిల్లాను. నుదుటిమీద చెమట తుడుచుకుంటూ, "దేవుడి సంగతి అలా ఉంచు. మానవమాత్రులెవరూ చూడలేదులే. ఎక్కడో ఊరవతల. రాత్రి. చుట్టుపక్కల నరప్రాణి ఉండే అవకాశం లేదు. ఆ పిల్ల ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. చిన్న స్పోర్ట్స్ కారు. దగ్గరికి వచ్చేవరకూ కనబడలేదు. నా కారంత పెద్ద కారుని ఆపడం సాధ్యమా? నా పొరబాటేముంది చెప్పు. బ్రేకు వేసి చూసాను. అయినా కారు ఆగలేదు, ఆ స్పీడులో. హిట్ అండ్ రన్‌లా పారిపోలేదు. దిగి చూసాను. కానీ ఏం లాభం? చిన్న కారు కదా, తిరగబడిపోయింది. లోపల ఆ అమ్మాయి శరీరం నలిగిపోయింది. నన్నడిగితే అంత చిన్న కార్లు తయారు చేయకూడదని



శాసనం వేయాలి..."

"అమ్మాయిని హాస్పటల్‌కి తీసుకెళ్ళి చూపించి ఉంటే...?"

"ప్రాణం పోయిందని చెప్తున్నానుగా?"

"... నువ్వు డాక్టరువి కావు."

"కాను. ఆ కొనప్రాణం గురించి హాస్పటల్‌కెళితే వాళ్లు కేసు నా మీద పెడతారు. అందుకే చల్లగా జారుకుని కారు పట్టుకొచ్చి ఇంటి గరాజ్‌లో పెట్టేసా. అదృష్టవశాత్తూ కారు మీద గీతలేమీ పడలేదు."

"గీతనెవరూ తప్పించలేరు." అంది నుదుటిమీద వేలితో రాసుకుంటూ.

"అలాగే స్పీడునెవరూ తగ్గించలేరు. డెబ్భై మైళ్ల స్పీడులో వెళుతున్నాను. సడన్‌బ్రేకు వేసి ఉంటే నా కారు బోల్తా కొట్టేది. అదృష్టం, ఎవ్వరూ చూడలేదు. ఎవరికీ తెలియదు కూడా. నువ్వు కూడా నోరు తెరవద్దు." అన్నాను.

"నేను నోరు తెరిచే అవసరమే పడదు." అంది అక్క సర్వాంతర్యామిలా, "దాచవలసినది, దాచగలిగేదీ ఏమీ లేదు."

నాకు తిక్కరేగింది. ఒక పక్క నేను హడలి ఛస్తూ ఉంటే ఈ మెట్టవేదాంతం ఏమిటిట? "నేనేమైనా కావాలని చేసానా? నేను ఎటువంటివాడినో నీకు తెలియదా? ఇంతకుముందు ఎన్నడైనా ఇలా జరిగిందా? ఎక్కడో దూరం నుంచి డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నాను. కళ్లు పీకుతున్నాయి. రెప్పలు మూతలు పడుతున్నాయి. ఏ మాత్రం వీలున్నా ఆమెను రక్షించేవాణ్ణే. కానీ ఏం చేస్తాం? ఆ అమ్మాయి దురదృష్టం, నా దురదృష్టం. నాకూ బాధగానే ఉంది. రేపే కారు టైర్లు మార్చేస్తాను..." అని తల ఎత్తి ఆమె కేసి చూసాను. ఆమె చూసే చూపు నన్ను కలవరపరిచింది.

"ఇక నువ్వు ఏమీ మాట్లాడకు. నన్ను పడుకోనీ. భోజనం చేయను. చేయాలని లేదు. నిద్రపడితే చాలు నాకు. నీకు పుణ్యం ఉంటుంది, ఆ టాపిక్ ఎత్తకు." అంటూ విస్కీ గ్లాసు సింక్‌లో పడేసి పడగ్గది వైపు నడిచేను.

మంచం ఎక్కాను కానీ నిద్ర ఏదీ? స్లీపింగ్ పిల్స్ వేసుకోవలసి వచ్చింది. నాకు తెలుసు అక్కకు అది నచ్చదు. నీ పొరబాటేమీ లేనప్పుడు పోలీసులకు చెబితే నష్టం ఏమిటి? అంటుంది. తనకు లోకజ్ఞానం లేదు. వాళ్ల పంజాలో చిక్కితే మన పని అంతటితో సరి. అక్క గది బయటే తిరుగుతోంది. రక్ష ఇవ్వడానికన్నట్టు. అదేమిటో తను దగ్గర్లో ఉంటే ఏదో తెలియని ధైర్యం, తృప్తి. నిద్రపట్టింది.

మర్నాడు సాయంత్రం ఇంటికి రాగానే "ఆలస్యమయిందేం?" అంది.

కానీ నా హడావుడి నాది. "ఎవరైనా పోలీసులు వచ్చారా? గరాజ్ తెరవమన్నారా?" అని ప్రశ్నలు

గుప్పించాను.

"లేదు." అతి క్లుప్తమైన జవాబు.

"కారు తీసుకెళ్లలేదుగా. బస్సులో రావలసి వచ్చింది. అన్ని స్టాపుల్లో ఎక్కేవాళ్లు, దిగేవాళ్లు. పైగా చెకింగ్ ఒకటి. వచ్చేసరికి ఈ వేళయింది. సాయంత్రం పేపర్లో ఈ యాక్సిడెంటు వార్త వేసారు. ఆ అమ్మాయి పేరు లావణ్యట. వయస్సు 24. తెల్లవారుఝామున ఎవరో రైతు కంటపడింది శవం. హిట్ అండ్ రన్ కేసు అని రాసారు పేపరు వాళ్లు."

"నేనూ చూశాను. భోజనానికి వస్తావా?" అంది అక్క

"నేను మాత్రం ఏం చేయగలను చెప్పు. ఆ అమ్మాయి కూడా స్పీడుగా వస్తోంది. కనబడలేదు. అయినా అమ్మాయి అయి వుండి అంత స్పీడుగా కారు నడపడమా? నేను ట్రై చేసినా నా కారు ఆగలేదు. అర్థమయ్యిందా? ఇలాటివి రోజూ జరుగుతూనే ఉంటాయి. నిన్న నా చేతుల మీదుగా.."

"అన్నం చల్లారిపోతోంది." అంది అక్క ఏ సమాధానం చెప్పకుండా. 'పోన్లే, నీ తప్పు మాత్రం ఏముంది?' అని అనవచ్చుగా. అనలేదు. అనదు. నన్ను వేధించడం ఎలాగో తనకు బాగా తెలుసు.

భోజనం చేస్తూ కూడా నాకు ఆ యాక్సిడెంటు ధ్యాసే. "ఇవాళ పొద్దున్న కారు బాగా పరీక్షించాను, పగటి వెలుతురులో చూశా. ఎక్కడా సొట్ట పడలేదు. పెయింటు లేచిపోవడం కూడా జరగలేదు. అద్దాలు కూడా పగలలేదు. అయినా నేను జాగ్రత్తగానే ఉంటాను. ఆ కారు కొన్నాళ్లు బయటకు తీయనులే. పోలీసువాళ్ల కంట పడిందంటే అనుమానం వచ్చి లేబరేటరీకి తీసుకెళ్లి పరీక్షిస్తారు. ఎక్కడో ఏ దుమ్మో కనబడినా చాలు, దాన్ని బట్టి ఏవేవో క్లూలు లాగేసి జైలుకి పంపించేస్తారు. కారు ఓ మూల పెట్టిస్తే సరి."

"కారుని ఏం చేస్తావన్నది కాదు ప్రశ్న!" అక్క అంది నిర్లిప్తంగా.

నాకు చివ్వున కోపం వచ్చింది. "మళ్లీ మొదలుపెట్టక. అసలు నీకు బుర్ర చెడిపోయింది. కామన్‌సెన్స్ లేకుండా పోయింది. నీ సంగతి నువ్వు చూసుకో చాలు. దీని గురించి ఎక్కడా నోరు జారక. అదే నువ్వు నాకు చేసే ఉపకారం." అన్నాను దురుసుగా.

"నేను నీ పేర పూజలు చేయించాను."

"సంతోషం. అంతకంటే కారు గురించి నాకో చక్కటి ఐడియా చెబితే ఇంకా సంతోషిస్తాను. నీకు నేను, నాకు నువ్వు. ఇంకెవరున్నారు చెప్పు. నా గురించి పోలీసులకు చెప్పవులే, నాకా నమ్మకం ఉంది. కానీ కారు గొడవలోంచి ఎలా బయటపడాలి అది చెప్పు. రక్తం గుర్తులున్నాయి కాబట్టి ఆ నాలుగు టైర్లు మార్చేసి కొత్తవి కొంటాననుకో. కానీ పోలీసులు ఇలా టైర్లు కొన్నవాళ్లందరినీ ఓ కంట కనిపెడుతున్నారేమో. పోనీ కారు ఎక్కడైనా పట్టుకెళ్లి వదిలేసాననుకో. అది ఎవరిదో రికార్డులు చూసి కనుక్కోగలరు. అమ్ముదామన్నా అంతే! దొంగల్ని పట్టుకోలేకపోయినా ఇలాటివి మాత్రం బాగానే వాకబు చేయగలరు పోలీసులు. కారు వదిలించుకోవడం ఎలా? కాస్త చెప్పు." అన్నాను.

"నువ్వు చేసిన పాపం వదిలించుకోవడం ఎలా?" అంది అక్క జవాబుగా.

"పాపం ఏమిటి? పాపం!? తెలిసిచేస్తే పాపం. ఆ అమ్మాయి నాకేమైనా శత్రువా, కావాలని చంపడానికి? యాక్సిడెంటు జరగ్గానే వెళ్లి పోలీసులకు చెప్పకపోవడం పాపమనా నీ ఉద్ధేశ్యం? నేను చెప్పినదల్లా వాళ్లు నమ్ముతారని గారంటీ ఇస్తారా నువ్వూ, నీ కృష్ణపరమాత్మా? నువ్వు పోలీసుల దగ్గరికి వెళ్లి చెప్పకుండా ఉంటే అది చాలు."

"దాని అవసరం ఉండదులే" అంటూ లేచి వెళ్లిపోయింది అక్క

శనివారం నాడు పేపర్లో ప్రకటన చూసాక నాకు ఉత్సాహం వచ్చింది. "చూసావా అక్కయ్యా? ఇదేదో నా కోసమే వేసినట్టుంది. కారు కావాలిట. తన పేర రిజిస్ట్రేషన్ కూడా అక్కరలేదుట. దూర ప్రయాణానికి పనికివచ్చేట్టుగా ఉండాలిట. వెంటనే కావాలిట. దానికి బదులుగా తన దగ్గరున్న ప్లాటు ఇస్తాడట."

"ఇంటిస్థలం ఏం చేసుకుంటావు? అది మంచి ప్లాటని నీకెలా తెలుసు?"

"మంచిదయి ఉండదనే నేనూ అనుకుంటున్నానులే. అది ఎలా ఉన్నా నా కనవసరం. సెకండ్ హేండ్ కారుకి మంచి స్థలం వస్తుందని నేను అనుకోవటం లేదు. కానీ కారు గొడవ వదులుతుంది ముందు. దాన్ని తీసుకుని వాడు ఎక్కడో దూరప్రాంతానికి వెళ్లిపోతాడు. పోలీసులు వెతుకుదామన్నా కనబడదు. నేను భయంతో హడలి చావక్కరలేదు."

"దేవుణ్ని నమ్ముకున్నవాడు ఎవరికీ భయపడడు."

నేను చరణ్ ఇంటికెళ్లినప్పుడు కారులోనే వెళ్లవలసివచ్చింది. వాళ్ల ఇల్లు మా ఇంటికి మూడు మైళ్ల దూరంలోనే ఉంది కాబట్టి సాహసించాను. తర్వాత అతను ప్లాటు కొండమీద ఉందని, నా కారులోనే అక్కడకు వెళదామని అన్నప్పుడు కొండప్రాంతం కదా, పోలీసులుండరని గుండె దిటవు చేసుకున్నాను. కారు నడుపుతున్నంత సేపు ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాను నా నెర్వస్‌నెస్ పోగొట్టుకోవడానికి. కానీ చరణ్ నోరు విప్పలేదు. పెదవి విప్పి పలకటం లేదు. చాలా అసహనంగా, ఈ వ్యవహారం ఎంత త్వరగా ముగిసిపోతే అంత మంచిది అన్నట్టు ఉన్నాడు. నా గురించి అడగటం లేదు. తన గురించి చెప్పడం లేదు. కొండ దగ్గరికి వచ్చేసరికి తను డ్రైవింగు సీటులో కూచున్నాడు. అతి వేగంగా కారు నడుపుతూ ఒక స్థలానికి తీసుకొచ్చాడు. రాళ్లూ, రప్పలూ చదునుగా, చుట్టూ అతి మనోహరమైన తోటలతో చాలా అందంగా ఉంది ఆ ప్లాటు.

"ఇదేనా?" అన్నాను.

"అవును. మీరీ స్థలం తీసుకుంటే నేనా కారు తీసుకుంటాను. సరేనా?" అన్నాడు చరణ్.

అతనంత కట్టె, కొట్టె తెచ్చెనన్నట్టు మాట్లాడడంతో నాకు సందేహం పుట్టుకొచ్చింది. దీంట్లో ఏదైనా తిరకాసు ఏమైనా ఉందా? అని. "నేను కారు ఇస్తాను. మీరు అది వేసుకుని ఇవాళే ఊరొదిలి వెళ్లిపోతారు. కానీ మరి ప్లాటు అంటే... రిజిస్ట్రేషనూ అదీ.. పైగా ఈసీ అదీ చూడాలిగా..." నాన్నాను.

"అన్నీ రాయించి పట్టుకొచ్చాను. మా వకీలు పేర పవరాఫ్ అటార్నీ రాసి ఇస్తాను. ఆయన తక్కిన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేస్తాడు. ఆయన్ని మీ దగ్గరికి రమ్మనమంటాను."

"పోనీ మీరు సోమవారం దాకా ఉండి, అన్ని పనులూ పూర్తి చేసుకుని..."

"..కుదరదు. వెంటనే వెళ్లిపోదలుచుకున్నాను." అన్నాడు చరణ్ అతి దృఢంగా.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత మంచి ప్లాటు.. నా కారుకి బదులుగా.. ఇందులో ఏదో మర్మం ఉండి ఉండాలి. అందులో అతని తొందర చూస్తూ ఉంటే..

"దీనిలో ఏదైనా లొసుగు ఉంటే చెప్పేయండి." అన్నాను.

"లొసుగేమిటి? స్థలం మీ ఎదురుగానే ఉందిగా" అన్నాడు చరణ్ చికాకు ప్రదర్శిస్తూ.

"స్థలంలో కాదు. ఈ డీల్‌లో మడతపేచీ ఏమైనా ఉంటే.."

"చూడండి. మీకు నచ్చకపోతే ఆ విషయం దాపరికం లేకుండా చెప్పేయండి. నేను వేరే వాళ్లని చూసుకుంటాను..." అన్నాడు చరణ్ వేగంగా కదులుతూ.

అమ్మో! ఇది వదులుకుంటే మళ్లీ ఇలాటి బేరం కోసం ఆ కారేసుకుని ఇంకా ఎన్ని ఇళ్లు తిరగాలో ఎంతమంది కంటబడాలో! వద్దులే. "ఫర్వాలేదు లెండి. నేను రెడీయే" అన్నాను. "మా ఇంటికి రండి. ఫోన్ చేసి మీ లాయర్‌గార్ని అక్కడకు రమ్మనందాం. రాతకోతలు అయిపోతే మంచిది." అని సూచించాను.

కార్లో తిరిగివచ్చేటప్పుడు అతని మాటల్లో పెట్టాలని చూసాను. అతను ఇంత మంచి ప్లాటు ఎందుకు అమ్ముతున్నాడో కనుక్కోవాలి. దీనిలో ఏదైనా ఉందా? ఏదైనా కబ్జా వ్యవహారమా? మనిషి ధనవంతుడిలాగానే ఉన్నాడు. కబ్జాలు చేసేరకం కాదు. మరి? ఆ స్థలంలో వాస్తు సరిగ్గా లేదా? చేతబడులు చేస్తారా? లేక ఎవర్నైనా హత్య చేసేసి శవాన్ని దీంట్లో పాతిపెట్టేసాడా? ఏదో ఇసక తక్కెడ, పేడ తక్కెడ కథలా కాకూడదీ వ్యవహారం. అతను వెళ్లే దూరప్రయాణం గురించి ఎన్ని

రకాలుగా అడిగినా అతను సమాధానం చెప్పలేదు. కొరకరాని కొయ్య.

ఇంటికి రాగానే అక్కయ్యను పక్కకు పిలిచాను. “వచ్చినాయన నా కారు కొంటున్నాడు. నువ్వు ఏమీ మాట్లాడకు. నోరు తెరవకు. కాఫీ కలిపి తీసుకురా. ఆయన దగ్గిర భగవద్గీత, దేవుడు అంటూ పురాణం విప్పకు.” అని హెచ్చరించాను.

“మనం నిమిత్తమాత్రులం” అంటూ ఆమె వంటింట్లోకి వెళ్లింది.

లాయర్ గారు వచ్చేవరకు మేమిద్దరం మౌనంగానే ఉన్నాం. “మీరు చాలా తొందరలో ఉన్నట్టుగా ఉన్నారే?” అన్నాను.

“అవును. నేనివాళే ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లాలని నిశ్చయించుకున్నాను.”

ఏదైనా దొంగనోట్ల వ్యాపారమేమో? నోట్లన్నీ అక్కడ కప్పెట్టేడేమో? ఇంతలో ఇంకో ఆలోచన. ఇప్పుడు వచ్చేవాడు లాయరని మనకు ఎలా తెలుసు? మొహం మీద రాసి ఉండదుగా? వీళ్ల ముఠా వాడేమో. నన్ను దీనిలో ఇరికిస్తున్నారేమో? ఈ భయాలన్నిటి బదులు డైరెక్టుగా అడిగితే పోలా?

“ఈజ్ దేర్ ఎనీ కాచ్ ఇన్ దిస్? ఏదైనా చిదంబర రహస్యం ఉందా? అహ నేను ప్లాటు తీసుకుంటాననుకోండి. జస్ట్ అవుట్ ఆఫ్ క్యూరియాసిటీ..”

“మీరు నా పర్సనల్ విషయాలు అడుగుతున్నారు. నేను ముందే చెప్పాను..” అంటూ మొదలెట్టాడు చరణ్.

“మహాప్రభో, ఎవరికిష్టం లేకపోయినా డీల్ ఆఫ్ అని తెలుసు. ఒప్పుకుంటున్నాను. దాని గురించి కాదు. అసలు...” నా మనసు దొలిచేస్తోంది సందేహం. ఏమడిగినా పెదవి విప్పడు వీడు.

లాయర్ వచ్చాడు. అక్కే వెళ్లి తలుపు తీసింది. ‘పోనీ ఈయన చెప్తాడేమో ఆ స్థలంలో శవాన్ని ఎక్కడ పాతిపెట్టారో, ఏం చేసారో’ అనుకుంటూ ఆయన కేసి చూసాను. ఆయన డాక్యుమెంటు తయారీలో ఉన్నాడు. పది నిమిషాలలో, అక్క కాఫీ తెచ్చేంతలో సంతకాలు అయిపోయాయి. ఇప్పటికైనా విషయం తెలుసుకోవాలి.

“చూడండి చరణ్ గారూ. రాతకోతలు అయిపోయాయి. ఇప్పుడు నేను వెనక్కి వెళ్లే ప్రసక్తి లేదు. వెళితే మీరు నన్ను కోర్టు కీడ్చవచ్చు. ఇప్పటికైనా చెప్పండి. మీరు అంత మంచి స్థలం..”

చరణ్ విసుక్కున్నాడు. “మీరు వదిలిపెట్టేటట్టు లేరు.” అంటూ.

లాయర్ కలగజేసుకున్నాడు. “ఏం లేదు సార్. చరణ్ లావణ్య అనే ఒక అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి నిశ్చయమయింది కూడా. ఆమె కోసం కొండ మీద ఒక స్వప్న సౌధం కడదామనే ఎన్నో ప్లాన్లు వేసాడు. కానీ దురదృష్టవశాత్తూ ఆ అమ్మాయి పోవడంతో చరణ్ మనస్సు విరిగిపోయింది. ఆ స్థలం అమ్మేసి ఊరు వదిలిపోవడానికి నిశ్చయించుకున్నాడు. అంతే!”

“అయ్యో పాపం, ఎలా పోయింది?”

“మొన్న మంగళవారం రాత్రి ఈయన స్పోర్ట్స్ కారులో ఆ అమ్మాయి వెళుతూంటే ఎవడో త్రాష్టుడు కారు గుద్దేసి గుంటలో పడేసి పోయాడు..”

నాకు ఒళ్లంతా చెమట. ఆపాదమస్తకం వణుకుతున్నాను. నెర్వస్‌నెస్ వల్ల మాటలు పెగలటం లేదు. వాళ్లు పసిగట్టేసి నట్టున్నారు.

నా మొహంలో రంగులు మారడం చూసి లాయర్ “కారు విషయంలో ఏదో మెలిక ఉన్నట్టుగా ఉంది. ఏమిటది?” అన్నాడు. నేను జవాబు చెప్పే స్థితిలో లేను. అక్క కేసి తిరిగాడు అతను. తను పెదాలు కదిపింది కానీ ఏమీ పలకలేదు. కానీ ఆమె చూపులే ఏవో చెబుతున్నాయి, ముఖ్యంగా నాకు.

“తన మాటలు నమ్మకండి సార్. అదోలాటి మనిషి తను. అసలు నేను కావాలని యాక్సిడెంటు చేయలేదు సార్...” అని చెప్పడం మొదలెట్టాను. ఎంత దూరమని పారిపోగలం?